



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

19 వ వసంతంలోకి ...

ఎన్టీఆర్ కృష్ణా

శుక్రవారం 28 నవంబర్ 2025 పేజీలు 8




# తేమ శాతంతో..

## దోపిడీ చేస్తున్న మిల్లర్లు

2లో..

- లారీలు లేవంటూ రోజుల తరబడి ధాన్యం తరలించని అధికారులు
- 18 శాతం తేమ ఉన్నా 28 శాతం రేటు మీదే కొనుగోలు చేస్తున్న మిల్లర్లు
- తక్కువ తేమ శాతం ఉన్న ధాన్యం కొనని మిల్లర్లు
- చోద్యం చూస్తున్న అధికారులు
- దళారుల రాజ్యంగా రైతు సేవా కేంద్రాలు

పామర్రు మేజర్ న్యూస్ : ఆరుగాలం రైతన్నలు కష్టపడి పండించిన ధాన్యం అమ్ముకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు కొంటామని ప్రభుత్వం చెప్పిన మాటలు నీటి మీద రాతలు అయ్యాయి. రైతుల కష్టాలు పట్టించుకునే నాధుడు



# నేటి వరకు 8,22,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

- ధాన్యం కొనుగోలు చేసిన 4-6 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ మంత్రి నాదెండ్ల

వివరాలు 2లో

# సర్వజన ఆసుపత్రి అభివృద్ధిపై చర్చలు



- క్యాన్సర్ చికిత్సకు సంబంధించిన లినాక్ పరికరం ఏర్పాటుకు కృషి
- ప్రజాప్రతినిధుల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన మంత్రి సత్యకుమార్ యాదవ్
- విజయవాడ జీజీహెచ్లో సేవల వినియోగం బాగా పెరిగిందన్న ప్రజాప్రతినిధులు

ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, నవంబర్ 27, మేజర్ న్యూస్ : విజయవాడ సర్వజన ఆసుపత్రిలో క్యాన్సర్ వైద్య సేవలను మరింత మెరుగుపరిచే చర్యల్లో భాగంగా 'లీనాక్ (లీనియర్ యాక్సిలరేటర్) పరికరాన్ని

2

## భవానీ దీక్షా విరమణలకు.. కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- భవానీ దీక్షల విరమణ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం..
- భక్తులు సంతృప్తి చెందేలా అమ్మవారి దర్శనానికి ఏర్పాట్లు..
- 3 వేల మంది పోలీసులతో పూర్తి బందోబస్తు ఏర్పాట్లు..
- జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, సీపీ ఎసివీ రాజశేఖరబాబు..

ఇంద్రకీలాద్రి, మేజర్ న్యూస్ : దసరా విజయవంత స్ఫూర్తితో భవానీ దీక్షల విరమణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అవసరమైన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు భవానీ భక్తులు సంతృప్తి చెందేలా అమ్మవారి

మిగతా 2లో...



## తేమశాతంతో దోపిడీ చేస్తున్న మిల్లర్లు..

(మొదటిపేజీ తరువాయి)



లేక తమ ధాన్యాన్ని కొనే దిక్కు లేక రైతులు అందిన కాడికి అమ్ముకునే దుస్థితి నెలకొంది. కృష్ణాజిల్లాలో ఒక్క మిల్లర్ కూడా ధాన్యాన్ని కొనుగోలు చేయకపో వడంతో గోదావరి జిల్లాల నుండి వచ్చిన మిల్లర్లు 28 శాతం తేమ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని మీ తేమశాతం ఎంత ఉన్నా అదే ధర కు కొంటామంటూ కూర్చున్నారు. 28 శాతం తేమ ఉన్న ధాన్యం ధర 1550 రూపాయలు 20 శాతం తేమ ఉన్న ధాన్యం ధర దాదాపుగా 1700 కానీ మిల్లర్లు 20 శాతం అంతకంటే తక్కువ తేమ శాతం ఉన్న ధాన్యాన్ని కొను గోలు చేయడం లేదు. 28 శాతం రేటుకి ఈ ధాన్యాన్ని ఇస్తే కొంటామని కూర్చున్నారు. కొన్న ధాన్యాన్ని కూడా లారీలు లేవంటూ రోజుల తరబడి రోడ్ల మీదే ఉంచుతున్నారు. రైతు సేవ కేంద్రాలలో సరైన సమాధానం చెప్పేవారు లేక అధికారుల పర్యవేక్షణ కొరబడడంతో వారు ఆడింది ఆట పాడింది పాటగా ఉంది. రైతు సేవ కేంద్రాలు ధాన్యం కొనుగోలు కేంద్రాలు దళారులకు కేంద్రాలుగా మారాయని రైతులు ఆరోపణ చేస్తున్నారు. పామర్రు నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో రైతులు ధాన్యం కుప్పలు గా పోసి వారం రోజులైనా నేటి వరకు పలు గ్రామాలలో సంచులు ఇవ్వక పోగా ఇచ్చిన వారికి కూడా లారీలు రాకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ధాన్యం తేమ శాతంతో నిమిత్తం లేకుండా కొనుగోలు చేస్తామని ఒకవైపు అధికారులు మంత్రులు ప్రకటన చేస్తున్న ఆచరణలో మాత్రం కనిపించడం లేదు. దీంతో రైతులు ధాన్యం ఆరపోసి 20లోపు తేమ శాతానికి తీసుకువచ్చిన గిట్టుబాటు ధర ఇవ్వకుండా తక్కువ ధర ఇస్తామని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని సిబ్బంది ధరలు నిర్ణయించడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చాలామంది రైతులు తమ ధాన్యం తేమ శాతం 20 లోపు ఉన్నా 28 శాతం రేటుకి తెగ నమ్ముకుంటున్నారు. దీంతో బస్తాకు 150 నుండి 300 రూపాయల వరకు రైతులు నష్టపోతున్నారు. మంత్రులు, ప్రభుత్వ శాఖ అధికారులు ఇచ్చిన ఆదేశాలు నీటి మీద రాతలే అయ్యాయని రైతుల వాపోతున్నారు. కృష్ణాజిల్లాలో ఒక్క మిల్లర్ కూడా ఎందుకు ధాన్యం కొనడానికి ముందుకు రావడం లేదో అధికారులకే తెలియాలి. ఇప్పటికైనా అధికారులు కళ్ళు తెరిచి రైతుకు గిట్టుబాటు ధర అందే విధంగా తగిన చర్యలు తీసుకుని తక్కువ శాతం ఉన్న ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసి వెంటనే రవాణా సౌకర్యం కల్పించాలని రైతులు కోరుతున్నారు.

# నేటి వరకు 8,22,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

**విజయవాడ, మేజర్ న్యూస్ :** రైతులు దళారులను నమ్మకుండా రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరకు ధాన్యం అమ్మకాలు చేయాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రైతులకు విజ్ఞప్తి చేశారు. విజయవాడ రూరల్ లోని కానూరు సివిల్ సప్లైస్ భవన్ లో గురువారం ధాన్యం కొనుగోళ్లపై ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... రైతులు రూపాయి నష్టం పోకుండా ధాన్యం కల్లాల్లో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని వారి ఖాతాల్లో 4-6 గంటల్లో నగదు జమ వేస్తున్నామన్నారు.. కొద్దిమంది నేతలు అన్యాయంగా అబద్దాలు ప్రచారం చేస్తున్నారని రైతులు అలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు... గత ప్రభుత్వం రైతులకు రూ. 1,674 కోట్ల బకాయిలు పెడితే కూటమి ప్రభుత్వం చెల్లించిందన్నారు. కృష్ణా జిల్లాలో లక్షా 7 వేల టన్నుల ధాన్యం సేకరించడం నేడు ఒక రికార్డు అని అన్నారు. గోదావరి జిల్లాల నుంచి లక్ష టన్నుల పైనే ధాన్యం సేకరించామని, ఫీల్డ్ లో అధికారులు రేయింబవళ్లు కష్టపడి పని చేస్తున్నారని వారి మనోధైర్యం దెబ్బ తీసేలా కొద్దిమంది నేతలు నొటికొచ్చినట్లు విమర్శలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం 2022-23 లో 3,33,155 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ. 679.79 కోట్లు వారి ఖాతాల్లో వేస్తే కూటమి ప్రభుత్వం నేటి వరకు 8,22,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో రూ. 1,713 కోట్లు జమ చేశామన్నారు. గత ప్రభుత్వంలో ఇదే రోజున ట్రాన్స్ పోర్టు శాఖ లో 394 లారీలను నమోదు చేసుకున్నారన్నారు. 2023-24 లో 455 లారీలు మాత్రమే నమోదు చేసుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో నేడు 2,715 లారీలను ట్రాన్స్ పోర్టు డిపార్ట్ మెంట్ శాఖ లో నమోదు చేసుకున్నారన్నారు. ఖరీఫ్, రబీ లో కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు జిల్లాల్లో ట్రాన్స్ పోర్టు వాహనాల బకాయిలను నేడు రూ. 9 కోట్లు చెల్లించామన్నారు. 7 కోట్ల 53 లక్షల గోనె సంచులను రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేయగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనలతో వీటికి అదనంగా లక్ష గోనె సంచులను రైతు సేవా కేంద్రాల్లో అదనంగా సిద్ధం చేసి రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. మూడు నెలల్లో జరగాల్సిన ప్రక్రియ వాతావరణంలో వచ్చిన మార్పులతో రైతుల ఆందోళనను గుర్తించి ముందే ధాన్యం సేకరిస్తున్నామన్నారు.. ప్రభుత్వం చాలా వేగంగా స్పందించి చర్యలు తీసుకుంటున్న విషయం రైతులు కూడా అర్థం చేసుకోవాలన్నారు.. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లు ఇచ్చే సూచనలు, ప్రోత్సాహం వల్లే కేంద్ర ప్రభుత్వం నిబంధనల మేరకు 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. దళారులు రైతులను మాయ మాటలతో మోసం చేసేలా వ్యవహరిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం 75 కిలోల బస్తాకు రూ. 1792 రూపాయలు మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం రాష్ట్రంలో 30 వ తేదీ వరకు మనకు వర్షాలు లేవన్నారు.. ఆ తర్వాత ఐదు జిల్లాల్లో వర్ష సూచనలు ఉన్నాయి కృష్ణా, పశ్చిమ గోదావరి, ఏలూరు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో ఒకటో తేదీ నుంచి ఐసోలేషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని, దళారులు చేసే మోసాలు నమ్మవద్దన్నారు.. 24 వేల ట్రక్ ధాన్యం తరలింపుకు జీపీయస్ తో సిద్ధంగా ఉన్నాయన్నారు. వర్షాల నుంచి కౌలు రైతులను ఆదుకునేందుకు టార్పాలిన్ పట్టాలు పూర్తిగా సిద్ధంగా ఉంచామన్నారు. దళారీల అబద్దాలు నమ్మి రైతులు తక్కువ రేటుకు ధాన్యం అమ్ముకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. సివిల్ సప్లయిస్ శాఖ రైతుల కోసం ఎంతో చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. క్యాబినెట్ సమావేశం తర్వాత కృష్ణా, గుంటూరు జిల్లాల్లో మరోసారి పర్యటించి రైతులకు భరోసా కల్పిస్తామన్నారు. రైతులను తప్పుదోవ పట్టించేలా కొంతమంది అబద్దాలు ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ క్రాప్ నమోదు అయిన పొలంలో వచ్చే దిగుబడిని పూర్తిగా కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఫైన్ క్వాలిటీ రైస్ కు ప్రాధాన్యత ఇచ్చి.. మధ్యాహ్న భోజన పథకానికి వాడుతున్నామని, ఆ పంట ఎక్కడ ఉన్నా.. ప్రతి బస్తా కొనుగోలు చేయాలని అధికారులకు చెప్పామన్నారు. రాజకీయంగా అసత్యాలు ప్రచారం చేస్తున్న వారికి రైతులే సమాధానం చెప్పాలన్నారు.

# సర్వజన ఆసుపత్రి అభివృద్ధిపై చర్చలు

(మొదటిపేజీ తరువాయి)

అందుబాటులోనికి తెచ్చేందుకు అవసరమైన ప్రతిపాదనలు తయారుచేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఎన్టీఆర్ జిల్లా ఇంచార్జి మంత్రిగా కూడా ఉన్న సత్యకుమార్ కుమార్ యాదవ్ విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేటు కార్యాలయంలో విజయవాడ లోక్సభ సభ్యులు కేశినేని శివనాథ్, నగర ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహనరావుతో గురువారం ప్రత్యేకంగా సమావేశమై విజయవాడలోని సర్వజన ఆసుపత్రి అభివృద్ధి గురించి చర్చించారు. ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ క్యాన్సర్ వైద్య సేవల్లో ముఖ్యమైన లినాక్ పరికరాన్ని విజయవాడ జీజీహెచ్ లో అందుబాటులోనికి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దీనిపై మంత్రి సత్యకుమార్ స్పందిస్తూ క్యాన్సర్ కేసులను ప్రాథమిక దశలోనే గుర్తించి, ఉన్నత వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విజయవాడ జీజీహెచ్లో 'లినాక్ ఏర్పాటుకు అవసరమైన స్థలం గుర్తింపు, ప్రభుత్వ రంగ సంస్థల నుంచి (సామాజిక బాధ్యత) ఆర్థిక సహకారం మార్గాలను పరిశీలించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని చర్చల్లో పాల్గొన్న డైరెక్టరేటు ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారులను మంత్రి ఆదేశించారు క్యాన్సర్ కణాలను నాశనం చేసేందుకు ఉపయోగించే ఈ పరికరం ఏర్పాటుకు ప్రత్యేకంగా బంకరు ఆసుపత్రిలో ఏర్పాటుచేయాల్సి ఉందని అధికారులు చెప్పగా నిపుణులు రప్పించి, ఆ ప్రక్రియను పూర్తి చేయాలని మంత్రి స్పష్టంచేశారు ఈ పరికరం సమకూర్చేందుకు సుమారు రూ.20 కోట్ల వరకు ఖర్చు అవుతుంది.

**నర్సింగ్ కళాశాల విద్యార్థినుల సమస్యల పరిష్కారంపై హామీ!**

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ చేసిన విజ్ఞప్తిపై మంత్రి సత్యకుమార్ స్పందిస్తూ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు హాస్టల్ విషయంలో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఔషధ నియంత్రణ శాఖ భవనాన్ని తాత్కాలికంగా ఉపయోగించుకునేలా ఉన్నతాధికారులతో మాట్లాడతానని చెప్పారు. దీనిపై త్వరలోనే సానుకూలంగా ప్రభుత్వం నిర్ణయాన్ని తీసుకుంటుందని హామీ ఇచ్చారు. పాత ప్రభుత్వాసుపత్రిలో మాతా, శిశువైద్య సేవల విస్తరణలో భాగంగా నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. విజయవాడ జీజీహెచ్లో సేవలు పొందే వారి సంఖ్య భారీగా పెరిగిందని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. వీరి అవసరాలకు తగ్గట్లు కొత్త, పాతాసుపత్రిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు సుమారు రూ. 80కోట్ల వరకు అవసరం ఉందని ప్రజాప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై మంత్రి సత్యకుమార్ స్పందిస్తూ పీజీ వైద్య సీట్ల పెంపునకు తగ్గట్లు కేంద్రం నుంచి వచ్చిన నిధుల వినియోగం, విజయవాడ జీజీహెచ్ చేపట్టిన పనులు వివరాలు నివేదించాలని డీఎంఈను ఆదేశించారు. ఇదేవిధంగా రాష్ట్రంలోని ఇతర ఆసుపత్రుల్లో చేపట్టిన నిర్మాణాల వివరాలను కూడా తెలియచేయాలని మంత్రి వారికి స్పష్టంచేశారు. ప్రాధాన్య క్రమంలో రాష్ట్రంలోని అన్ని ఆసుపత్రుల అభివృద్ధి జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వాసుపత్రుల్లో త్వరలో పూర్తయ్యే క్రిటికల్ కేర్ భవనాలను కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాతో ప్రారంభింపచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సమావేశంలో డీఎంఈ డాక్టర్ రఘునందన్, అదనపు డీఎంఈ డాక్టర్ వెంకటేష్, విజయవాడ జీజీహెచ్ ఇంచార్జి సూపరిండెంటు డాక్టర్ శ్యాం, ఆంకాలజిస్ట్ విభాగ అధిపతి డాక్టర్ నెహూ, రాష్ట్ర వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఇంజినీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# భవానీ దీక్షా విరమణలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు..

(మొదటిపేజీ తరువాయి)

దర్శనభాగ్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్పీ రాజశేఖరబాబు అధికారులకు సూచించారు. డిసెంబర్ 11 నుండి 15వ తేదీ వరకు నిర్వహించన్ను భవానీ దీక్షల విరమణ కార్యక్రమ సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను గురువారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు, మున్సిపల్ కమిషనర్ హెచ్ ఎం ధ్యానచంద్ర, ఆలయ ఈవో వి.కె. శ్రీనానాయక్లు సమన్వయ శాఖల అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ డిసెంబర్ 11 నుండి 15వ తేదీ వరకు భవానీ దీక్షల విరమణ నేపథ్యంలో భక్తులకు అవసరమైన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ ఏడాది ఆరు లక్షల మందికి పైగా భవానీ భక్తులు తరలివస్తారని అంచనా వేయడం జరిగిందన్నారు. అయిదు రోజుల పాటు భవానీ దీక్షా విరమణలు నిర్వహించడం జరుగుతుందని ప్రతి రోజు దాదాపు లక్ష వరకు భవానీ భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారన్నారు. చివరి రెండు రోజుల్లో దాదాపు లక్షా 50 వేల మంది భవానీ భక్తులు రానున్న దృష్టి పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ విదాదీ దసరా ఉత్సవాలలో అంచనాలకు మించి భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన్నప్పటికీ అధికారులు సమన్వయంతో చేసిన ఏర్పాట్లు కారణంగా ఎటువంటి లోటుపాట్లకు తావులేకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని విజయవంతంగా ఉత్సవాలను నిర్వహించామన్నారు. ఇదే స్ఫూర్తితో టీమ్ ఎన్టీఆర్ జిల్లా భవానీ దీక్షల విరమణను విజయవంతం చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. దర్శనాకి తరలివచ్చే భక్తులు ఎటువంటి అసౌకర్యం జరగకుండా 36 సెక్టార్లను ఏర్పాటు చేసి ఒక్కో సెక్టార్కు ప్రత్యేక అధికారిని నియమించి పర్యవేక్షణ భాధ్యతను అప్పగించడం జరిగిందన్నారు. పర్యవేక్షణ అధికారులు వారికి కేటాయించిన సెక్టార్ లో భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పన పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా భక్తుల హోల్డింగ్ పాయింట్లు కేశఖండన ప్రదేశాలు, స్నాన ఘట్టాలు, గిరిప్రదర్శన, క్యూ లైన్లు, ఇరుముడుల సమర్పణ, హోమ గుండం, లడ్డు విక్రయ కేంద్రాలకు సంబంధించిన సెక్టార్ అధికారులు అత్యంత అప్రమత్తంతో పనులు పూర్తి చేసేలా పర్యవేక్షించాలన్నారు. ఇతర ప్రాంతాల నుండి అమ్మవారి దర్శనానికి విచ్చేసే భవానీ భక్తులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించేలా సమాచార కేంద్రాలు నిరంతరం అనౌన్స్మెంట్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని లడ్డు విక్రయ కేంద్రాలు, ఉచిత భోజన సౌకర్యకేంద్రాల సంఖ్య పెంచాలన్నారు. ఈ ఏడాది 10 వేల నుండికి పైగా భక్తులు కలశ జ్యోతులను సమర్పిస్తారని ఇందుకు అవసరమైన ఏర్పాటు చేయాలన్నారు. క్యూ మార్గంలో వాటర్ ప్రూఫ్ షామియానాలు, క్వాయిర్ మ్యాట్లు ఏర్పాటు చేయాలని మ్యాట్లను మూడో రోజు మార్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు అవసరమైన తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని, హోల్డింగ్ పాయింట్ల వద్ద మరుగుదొడ్ల సంఖ్య పెంచాలని టోల్ గేట్ నుండి ఓం టర్నింగ్ మధ్యలో మరుగుదొడ్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. భవానీ భక్తుల దీక్షా వస్త్రాలను స్నాన ఘట్టాల వద్ద వదిలివేస్తారని ఆయా ప్రాంతాలలో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు వస్త్రాలను స్వీకరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. నగర పోలీస్ కమిషనర్ ఎస్. వి. రాజశేఖర్ బాబు మాట్లాడుతూ పోలీసు అధికారులు, సిబ్బంది ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు, సెక్టార్ అధికారులను సమన్వయం చేసుకొని ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. భవానీ దీక్షల విరమణ కార్యక్రమానికి మూడు వేల మంది పోలీసులకు విధులు కేటాయించి పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేసిన్నట్లు తెలిపారు. నగరంలో 300లకు పైగా సీసీటీవీలను ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమైన ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షిస్తూ ఎక్కడ సమస్య ఎదురైనా తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలయ అధికారులు గురుభవానీలతో మాట్లాడి ఈ ఏడాది ఏ ఏ ప్రాంతాల నుండి ఎంత మంది భవానీ భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చేది ముందుగానే అంచనా వేసి తగిన విధంగా దర్శన ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ముఖ్యంగా లడ్డు విక్రయ కేంద్రాల వద్ద రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక యాప్ ద్వారా ముందుగానే లడ్డులను విక్రయించి టోకెన్లు జారీ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని సివ్ రాజశేఖర్ బాబు తెలిపారు. ఆలయ ఈవో వి.కె. శీనా నాయక్ మాట్లాడుతూ దసరా ఉత్సవాల తరహాలోనే భవానీ దీక్షా విరమణలను విజయవంతం చేసేందుకు ప్రణాళికాయుత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భవానీ భక్తులు ఇరుముడులు సమర్పించేందుకు మూడు ప్రదేశాలలో హోమ గుండాల ఏర్పాటు చేస్తున్నామని కలశ జ్యోతులను సమర్పించే భక్తులు, భవానీ భక్తులకు చిన్న లడ్డు, పులిహోర ఉచితంగా పంపిణీ చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. పోలీస్ శాఖ సహకారంతో గిరి ప్రదర్శన, అమ్మవారి ఊరేగింపునకు ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నామన్నారు. భక్తుల సౌకర్యార్థం సామాన్లు క్లోక్ రూమ్ల సంఖ్య పెంచడం జరిగిందని. 14 కౌంటర్ల ద్వారా లడ్డుల విక్రయానికి ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 850 మంది నాయి బ్రాహ్మణులతో 24 గంటలు కేశఖండన కేంద్రం నిర్వహించడం తో పాటు భవానీ భక్తుల సౌకర్యార్థం ఈ ఏడాది 20 లక్షల లడ్డులు సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అద్భుతం ఆధ్యాత్మిక వాతావరణంలో దీక్షా విరమణలు జరిగేలా వివిధ శాఖల అధికారుల సమన్వయంతో ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు ఈవో శీనా నాయక్ తెలిపారు.

# అల్టిమేట్ స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ జెన్ 5తో ఐక్యూ 15 ఆవిష్కరణ

## అత్యుత్తమ పని తీరు కోసం ప్రత్యేకంగా రూపకల్పన




**గుంటూరు, నవంబర్ 27, మేజర్ న్యూస్ :** అత్యుత్తమ పనితీరుకు ప్రసిద్ధి చెందిన ఐక్యూ ఈరోజు తన ప్రీమియం ఫ్లాగ్‌షిప్ స్మార్ట్‌ఫోన్ ఐక్యూ 15ను ఆవిష్కరించింది. హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌లో అత్యుత్తమ సామర్థ్యాలతో రూపొందించిన ఈ ఐక్యూ 15 మరింత వేగం, స్థిరత్వం, మల్టీటాస్కింగ్ సామర్థ్యం కోరుకునే యువ ప్రొఫెషనల్స్ కోసం రూపొందించబడింది. భారతీయ ఫ్లాగ్‌షిప్ ఫోన్లకు కొత్త ప్రమాణాలతో ఐక్యూ 15లో పరిశ్రమలోనే అత్యుత్తమమైన శామసాంగ్ 2కే ఎం14 ఎల్ఈఏడీ ఓఎల్ఈడీ డిస్‌ప్లేను అందించారు. ఇది ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్‌లో తొలిసారి అందుబాటులోకి వస్తోంది. ఫోన్ 2600 నిట్స్ (హెచ్బీఎం) ప్రకాశంతో భారతదేశంలోనే అత్యంత ప్రకాశవంతమైన డిస్‌ప్లేను అందిస్తుంది. 6000 నిట్స్ లోకల్ పీక్ బ్రైట్‌నెస్‌తో ఏ లోపలి లేదా బయటి వాతావరణంలో అయినా అత్యద్భుత స్పష్టతను ఇస్తుంది. పనితీరు విషయానికి వస్తే ఐక్యూ 15లో భారతదేశంలోనే వేగవంతమైన స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ జెన్ 5 ప్రాసెసర్ ప్రత్యేకమైన సూపర్ కంప్యూటింగ్ చిప్ క్యూ3ను ఉపయోగించారు. ఇది అసమానమైన వేగం, ఎఫిషెన్సీని అందిస్తుంది. భారతదేశంలోనే అతిపెద్ద 8కే సింగిల్ లేయర్ వీసీ కూలింగ్ సిస్టమ్ ఫోన్‌ను అధిక పని భారం ఉన్న సమయంలో కూడా చల్లగా ఉంచుతుంది. ఇందులో భారీ 7000ఎంఏహెచ్ సిలికాన్ అనోడ్ బ్యాటరీను అమర్చారు. ఈ సందర్భంగా ఐక్యూ సీఈఓ నిపుణ్ మార్యా మాట్లాడుతూ పని తీరు విషయంలో రాజీపడని వర్కింగ్ ప్రొఫెషనల్స్, యువ యూజర్ల కోసం ప్రతి హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ ఫీచర్‌ను ఎంతో ఆలోచించి అభివృద్ధి చేశామన్నారు. వేగం, శక్తి, ఇన్నోవేషన్ ఇవి ఐక్యూ బ్రాండ్ విలువలు, ఐక్యూ 15 ఇవన్నీ కొత్త స్థాయికి తీసుకెళ్తుందన్నారు. అమెజాన్ భారత విభాగం కేటగరీ లీడర్ తమ్మొ షా మాట్లాడుతూ ఐక్యూ 15 ఫ్లాగ్‌షిప్ స్మార్ట్‌ఫోన్ ఇన్నోవేషన్‌లో తదుపరి తరాన్ని సూచిస్తోందన్నారు. భారత వినియోగదారులు ఎదురు చూస్తున్న అత్యాధునిక టెక్నాలజీ, అత్యుత్తమ పని తీరును ఇది ఒకచోటకు తీసుకు వస్తుందన్నారు. ఈ డివైస్‌ను అమెజాన్.ఇన్ లో అందుబాటులోకి తీసుకురావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గేమింగ్, ఫొటోగ్రఫీ, రోజు వారీ పని తీరు ఏదైనా ఐక్యూ 15 రాజీపడని పనితీరుతో టెక్ ప్రేమికులను, పవర్ యూజర్లను ఆకట్టుకుంటుందని పేర్కొన్నారు.

# ఇంటింటి సర్వేలో ఎక్కడా డయేరియా కేసులను గుర్తించలేదు

## డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని

**విజయవాడ, నవంబర్ 27, మేజర్ న్యూస్ :** గురువారం యూపీహెచ్‌సీ చిట్టినగర్-05 పరిధిలోని ఓల్డ్ ఆర్ఆర్‌పేటలో ఓ అనుమానిత అక్యూట్ డయేరియా డిసీజ్ (ఏడీడీ) కేసు నమోదు కావడంతో డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని.. వైద్య అధికారులు, సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. 26 ఏళ్ల మహిళ స్వల్ప లక్షణాలతో ఉండి చికిత్స అవసరం లేకుండానే కోలుకుంది. అయినా 14 వైద్య బృందాల ద్వారా 1,234 ఇళ్లను, 3,745 జనాభాను కవర్ చేస్తూ విస్తృత ఇంటింటి సర్వే నిర్వహించినా ఎక్కడా ఎలాంటి ఏడీడీ కేసులు కనిపించలేదు. మూడు స్వల్ప లూజ్ మోషన్ కేసులు మాత్రమే నమోదు కాగా అవి ఒక రోజులోనే తగ్గిపోయాయి. వైద్య బృందాలు అన్ని ఇళ్లకు ఓఆర్ఎస్, జింక్ పంపిణీ చేశాయి. ఇదే సమయంలో విజయవాడ నగరపాలక సంస్థ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. సురక్షిత తాగునీటి కోసం ట్యాంకర్లు, బబుల్ క్యాన్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. నీటి నమూనాలను ప్రయోగశాలకు పంపించారు. రోజువారీ సర్వే, శానిటేషన్ పర్యవేక్షణ, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఎలాంటి అవుట్‌బ్రేక్, ఆందోళనకర పరిస్థితి లేదు. అయినా ప్రజలు జాగ్రత్తగా ఉండాలి.

### జిల్లాలో ఇసుక కొరత రాకుండా వినియోగదారులకు

# సమృద్ధిగా అందుబాటులో ఉంచాలి





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలో ఇసుక కొరత రాకుండా వినియోగదారులకు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలో ఉచిత ఇసుక విధానం అమలుకు తీసుకుంటున్న చర్యలపై ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతంతో పాటు రానున్న కాలంలో జిల్లాలో నిర్మాణ అవసరాలకు ఇసుక కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అందుకు అన్ని ఇసుక స్టాక్ యార్డులలో సమృద్ధిగా ఇసుక నిల్వలు అందుబాటులో ఉంచడానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనుమతుల మేరకు జిల్లాలో సెమీ మెకనైజ్డ్ విధానంలో యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేపట్టాలని సూచిస్తూ, కృష్ణా నదికి వరదలు తగ్గిన నేపథ్యంలో ప్రస్తుతం ఉన్నవాటికి అదనంగా మరో నాలుగు ఇసుక రీచ్‌లను గుర్తించి టెండర్లను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న ఇసుక నిల్వ లపై కలెక్టర్ ఆరా తీయగా, ఉన్న ఇసుక రీచ్‌లలో దాదాపు 8 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక వినియోగదారులకు అందుబాటులో ఉందని గనుల శాఖ అధికారులు వివరణ ఇచ్చారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ సత్యనారాయణ, బందరు ఆర్డీవో కే స్వాతి, గనుల శాఖ ఏడి శ్రీనివాసరావు, అసిస్టెంట్ జియాలజిస్ట్ కొండారెడ్డి, ఇరిగేషన్ శాఖ కేసి డివిజన్ ఈఈ రవి కిరణ్, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# జగన్నాథ స్వామి దేవాలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జగన్నాథ స్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం దేవాదాయ ధర్మాదాయశాఖ నిబంధన మేరకు ఆలయ కార్య నిర్వహణ కార్యదర్శి సభ్యులచే ప్రమాణం చేయించి సభ్యుల ప్రతిపాదన మేరకు గంపల దుర్గాభవాని చైర్మన్,సభ్యులుగా దేవగుప్తాపు సత్యవాణి, అడపాల సత్యకుమారి, కూతాడి జయలక్ష్మి, బట్రాజు వెంకట మహాలక్ష్మి, ముత్యాలపల్లి సత్యనారాయణ, కాజా ఫణీంద్ర, బత్తిన అగస్తేశ్వరరావు, తంగిరాల మిథున్ వ్యాస్, బృందావన సుధీర్ బాబుల ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం జరిగిన సభకు మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ అధ్యక్షత వహించారు. వేదిక అలంకరించిన పలువురు వక్తలు మాట్లాడుతూ,మచిలీపట్నం జగన్నాధపురం లో కొలువై ఉన్న జగన్నాథ స్వామి దేవస్థానానికి 600 సంవత్సరాల చరిత్ర ఉందని ద్వాపరయుగంలో శ్రీకృష్ణ పరమాత్మయే కలియుగంలో జగన్నాధుడిగా కొలువై ఉన్నారని పూరి జగన్నాథ స్వామి పరమాత్మ అవతారమే అని మన మచిలీపట్నంలో జగన్నాథ స్వామి ఉండటం మనందరి అదృష్టమని ప్రతి ఒక్కరు స్వామి వారిని దర్శించి దేవాలయాల అభివృద్ధికి కృషి చేయాలని సనాతన ధర్మాన్ని హైందవ సంస్కృతిని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వక్తలు తెలిపారు ధర్మకర్తల మండలిలో మహిళలకు కూడా దేవస్థానంలో సేవ చేసుకునే భాగ్యాన్ని కూటమి ప్రభుత్వం కల్పిస్తుందని



స్వామివారి సేవలో మహిళలు సనాతన ధర్మాన్ని హైందవ సంస్కృతి ఉట్టిపడేలా కార్యక్రమాలు చేపట్టి దేవాలయాల విశిష్టతను పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లు ఫౌండేషన్ చైర్మన్ నీలిమ, కార్పొరేటర్ పినిశెట్టి ఛాయాదేవి, ఘంటసాల మార్కెట్ యార్డ్ చైర్మన్ తోట భవాని, నాగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ లంకిశెట్టినీరజ, జోడు గుడుల దేవస్థాన చైర్మన్ దేవనూరి వీరబాబు, గొర్రెపాటి గోపీచంద్, మోటమర్రి బాబా ప్రసాద్,దూళిపాల శ్రీరామచంద్రమూర్తి, పివిఫణి కుమార్, పలువురు జనసేన, టిడిపి, బిజెపికూటమి నాయకులు వార్డు ఇన్చార్జిలు వివిధ హోదాలో ఉన్న ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



## కాలిఫోర్నియా బాదంతో రెండు సూపర్‌ఫుడ్స్

**విజయవాడ మేజర్ న్యూస్ :** శీతాకాలం ప్రారంభం అయింది. తినే ఆహారం పట్ల శ్రద్ధ చూపించటం.. శరీర పునరుజ్జీవనానికి, మొత్తం ఆరోగ్యం మెరుగుపడటానికి తోడ్పడుతుంది. సంపూర్ణ, పోషకాలు అధికంగా ఉండే పదార్థాలను తీసుకోవటం సమతుల్యత, శక్తిని పునరుద్ధరించడానికి ఒక సులభమైన మార్గం. ఈ సీజన్ దినచర్యలో సరిగ్గా సరిపోయే రెండు వంటకాలు ఆల్మండ్ అండ్ స్ప్రౌట్స్ టిక్కీచాట్, రోస్టెడ్ గోబీ అండ్ ఆల్మండ్ సూప్.. రెండూ కాలిఫోర్నియా ఆల్మండ్స్‌తో శక్తివంతం అయ్యాయి. ఇది ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్‌కు ప్రసిద్ధి చెందిన సూపర్‌ఫుడ్. ఈ వంటకాలు మొక్కల ప్రోటీన్, సహజంగా లభించే ఆరోగ్యకరమైన కొవ్వుల పోషకమైన మిశ్రమాన్ని అందిస్తాయి. అయితే కాలిఫోర్నియా బాదంలో ఉండే గొప్ప ఫైబర్ కంటెంట్ ఫైబర్‌మాక్సింగ్‌కు మద్దతిస్తూ, జీర్ణక్రియకు సహాయపడుతుంది. అంతేకాకుండా, ఎక్కువ కాలం కడుపు నిండుగా ఉందనే భావన కలిగిస్తుంది.

## అర్హులకు వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలి



**గన్నవరం, నవంబర్ 27, మేజర్ న్యూస్ :** గన్నవరం మండలంలోని మాదాలవారిగూడెం గ్రామంలో గురువారం సీపీఎం గ్రామ పార్టీ ఆధ్వర్యంలో అర్హులైన పేదలకు తక్షణమే పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ, సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కార్యదర్శి మమతకు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల పార్టీ నాయకుడు బెజవాడ తాతబ్బాయి మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా నేటికీ అర్హులైన వారికి పెన్షన్లు మంజూరు చేయడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. అర్హులైన నిరుపేదల జీవనాధారానికి పెన్షన్లు కీలకమని, అయినప్పటికీ ప్రభుత్వ ఆమోదం లేక పలు కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అర్హులైన పేదలందరికీ పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అర్హత కలిగిన వారందరినీ కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకులు శశికుమార్, సుబ్బయ్య, కోటేశ్వరరావు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందించిన వేదవ్యాస్



**పెడన/గూడూరు,మేజర్ న్యూస్:** అనారోగ్యానికి గురయిన బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బురగడ్డ వేదవ్యాస అన్నారు. ఈ మేరకు నియోజకవర్గం గూడూరు మండలంలోని గంధ్రం గ్రామానికి చెందిన గుడివాడ అనుమ కుమారికి ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ 4,28,785 రూపాయల చెక్ ను అందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అనారోగ్యానికి గురయిన బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. సహకరించిన ముఖ్యమంత్రికి చంద్రబాబుకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారని చెప్పారు.

## మూడోవ రోజు కొనసాగుతున్న రైతన్న మీకోసంలో పాల్గొన్న టిడిపి శ్రేణులు

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మైలవరం మండలం, మైలవరం లోని గౌడ్స్ బజారు లోని రైతులతో కలిసి మూడోవ రోజు కొనసాగుతున్న రైతన్న మీకోసం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు రైతులతో కలిసి తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ పథకాల గురించి వివరిస్తూ, రైతులకు ఈ ప్రభుత్వం అన్నివేళలా అందుబాటులో ఉంటుందని తెలియజేశారుఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తెలుగు యువత రైతులు పాల్గొన్నారు.



## మహిళలకు కూటమి అండదండలందిస్తోంది

**కొల్లు ఫౌండేషన్ అధినేత్రి,మంత్రి రవీంద్ర సతీమణి నీలిమ**

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మహిళలకు చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అండదండలు అందిస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి నీలిమ అన్నారు. జగన్నాథపురం జగన్నాథ స్వామి ఆలయంలో గురువారం పలువురు మహిళలు కొల్లు నీలిమ తో రాజకీయ విశేషాలు, అంశాలపై మాట్లాడారు. నీలిమ మాట్లాడుతూ మహిళలకు చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఆర్థిక అభివృద్ధికి చేదోడు వాదోడుగా ఉంటుందన్నారు. సంక్షేమ పథకాలలో ప్రథమ ప్రాధాన్యం మహిళలకే అన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం, డ్వాక్రా మహిళలకు ఎన్నో ప్రోత్సాహకాలు ఇస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎంతో అండగా ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం దేవాలయ కమిటీలతో పాటు అన్ని కమిటీలలో కూడా మహిళల్ని నియమించడం జరిగిందన్నారు. మంత్రి రవీంద్ర సహకారంతో పదవులు పొందిన పలువురు నీలిమకు కృతజ్ఞతలు తెలిపారు. బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, పి.వి.ఫణి కుమార్, నాగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ లంకి శెట్టి నీరజ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చోడవరపు లక్ష్మీ ప్రసన్న, ఆంజనేయ దేవస్థానం బోర్డు మెంబర్, ఉమాదేవి, పద్మజ, గాయత్రి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు నేరం



**మొవ్వ మేజర్ న్యూస్ :** బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని కూచిపూడి ఎస్.ఐ పి.శిరీష అన్నారు. గురువారం మండల కేంద్రమైన మొవ్వ ఎస్.ఎం.కే జడ్పీ పాఠశాలలో బాల్యవివాహాల వల్ల బాలికలకు కలిగే నష్టాల పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో కూచిపూడి ఎస్.ఐ శిరీష మాట్లాడుతూ బాల్య వివాహాలు సాంఘిక దురాచారం, నేరమని అన్నారు. బాలికలకు విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకం కలిగే ప్రమాదముందన్నారు. మండలంలోని ఏ గ్రామంలోనైనా బాల్య వివాహాలు జరుగుతుంటే సమాచారం అందించి వారు కన్న కలలు సాకారం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాల్యవివాహాలపై తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించి వారి భవిష్యత్తుకు బంగారు బాట వేసేందుకు ప్రతి ఒక్క విద్యార్థి కృషిచేసి బాల్య వివాహాల రహిత ఆంధ్ర ప్రదేశ్ గా తీర్చిదిద్దేందుకు మీ వంతు సహకారం అందించాలని విద్యార్థిని విద్యార్థులకు ఎస్.ఐ శిరీష పిలుపునిచ్చారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## సాంస్కృతిక వికాసానికి స్వర్గీయ మండలి నిర్విరామ కృషి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** విద్యాభివృద్ధికి, సాంస్కృతిక వికాసానికి స్వర్గీయ మండలి వెంకటకృష్ణారావు కృషి మరువలేనిదని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంపీటీసీ సభ్యులు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) అన్నారు. ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, దివిసీమ పునర్నిర్మాత స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం అవనిగడ్డ వంతెన సెంటరులో కృష్ణారావు విగ్రహానికి తాడికొండ చిన్నా, ఘంటసాల మండలం పాపవినాశనం గ్రామ ప్రముఖులు కుంపటి చిట్టిబాబు, గ్రామ పార్టీ సంకర వీరయ్య చౌదరి, టీసీ అధ్యక్షులు బోయిన నాగేంద్రరావు, ఈడుపుగంటి కృష్ణప్రసాద్, డొక్కు భీమ రాజు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మండలి వెంకట కృష్ణారావు శత జయంతి కమిటీ, గాంధీ క్షేత్రం కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గాంధీ క్షేత్రం కమిటీ కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# కేసరపల్లిలో విగ్రహ పునఃప్రతిష్ట



ప్రత్యేక పూజల్లో యార్లగడ్డ దంపతులు..

**గన్నవరం, నవంబర్ 27, మేజర్ న్యూస్ :** గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలోని శ్రీ గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో విగ్రహ పునఃప్రతిష్ట కార్యక్రమంలో ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే వెంకట్రావు దంపతులు పాల్గొన్నారు. ఆలయంలో దాసాంజనేయ స్వామి, విఘ్నేశ్వరుని విగ్రహాల పునఃప్రతిష్ట కార్యక్రమం గురువారం ఉదయం నిర్వహించారు. ఉదయం ఆలయానికి వచ్చిన వెంకట్రావు, జ్ఞానేశ్వరి దంపతులకు ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న దంపతులు ఇరువురు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత మూడు రోజులుగా జరుగుతున్న హోమం ముగింపు సందర్భంగా పూర్ణాహుతి సమర్పించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ... గన్నవరం నియోజకవర్గ అభివృద్ధికి దైవానుగ్రహం తోడు కావాలని, నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని దైవాన్ని కోరుకున్నట్లు చెప్పారు. విగ్రహ ప్రతిష్ట లో పాల్గొన్న యార్లగడ్డ దంపతులను వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. అనంతరం శివ కళ్యాణం జరిపి అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గన్నవరం ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, టిడిపి నాయకులు జాస్తి విజయభాషణ కుమార్(బుజ్జి), ఎం వి ఎల్ ప్రసాద్, మూల్పూరి మాధవన్, అన్నే హరికృష్ణ, కోసూరు వెంకటేష్, అన్నే అంజిబాబు, ఎస్.రామకృష్ణ, శేషు, తదితర కూటమి నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శించిన అధికారులు



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని కపిలేశ్వరం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం గన్నవరం వ్యవసాయ సహాయ సంచాలకులు సునీల్, మండల వ్యవసాయ అధికారి గణేష్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్ర కార్యకలాపాలను పరిశీలించిన అధికారులు రైతులకు ముఖ్యమైన సూచనలను అందించారు. రైతులు పంట కోత చేసిన తర్వాత పచ్చిధాన్యం, బాగా ఆరబెట్టిన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని స్పష్టం చేశారు. తేమశాతం నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ధాన్యాన్ని మాత్రమే స్వీకరించనున్నట్లు తెలిపారు. పంట కోత ముందు తెలియపరచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి రైతు పంట కోత చేయడానికి ముందే రైతు సేవా కేంద్రం ద్వారా వ్యవసాయ శాఖకు తెలియపరచవలసిందిగా సూచించారు. ఇది ధాన్యం కొనుగోలు ప్రక్రియను సులభతరం చేస్తుందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా వ్యవస్థీకృతంగా కొనుగోళ్లు జరిపేందుకు సహకరిస్తుందని పేర్కొన్నారు. పారదర్శకమైన కొనుగోలు వ్యవస్థ ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా రైతులు తమ ధాన్యాన్ని నేరుగా ప్రభుత్వానికి కనీస మద్దతు ధరకు విక్రయించే అవకాశం కల్పించబడుతోందని, మధ్యవర్తులు లేకుండా పారదర్శకంగా లాభం అందేలా వ్యవస్థ ఏర్పాటు చేయబడిందని అధికారులు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తక్షణమే పరిష్కరించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నట్లు హామీ ఇచ్చారు.

## పైడమ్మవారి జాతర మహోత్సవాలలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలి



**పెడన,మేజర్ న్యూస్ :** గ్రామ దేవత శ్రీ పైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలలో పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలని వేలాదిగా వచ్చే భక్తులకు ఎటువంటి సౌకర్యం కలగకుండా శానిటేషన్ విభాగం అధికారులు పనిచేయాలని ఇది చైర్మన్ ఆదేశం అని మున్సిపల్ సీనియర్ వైసీపీ కౌన్సిల్ సభ్యులు కటకం ప్రసాదు సచివాలయ వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ చైర్ పర్సన్ కటకం నాగ కుమారి ఆదేశాల మేరకు చైర్పర్సన్ చాంబర్లో, 8వ వార్డు సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, వైస్ చైర్మన్ మొహమ్మద్ ఖాజా సచివాలయాల వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీలతో రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేసినారు. ఈ సందర్భంగా వారు ఒక ప్రకటనలో మాట్లాడుతూ మరికొద్ది రోజుల్లో జరగబోవు శ్రీ పైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవముల సందర్భంగా పట్టణంలో శానిటేషన్ సక్రమంగా ఉండాలని, అమ్మవారి దర్శనార్థం వేరు వేరు ప్రాంతాల నుండి వచ్చు భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండగా శానిటేషన్ ఉండాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్ కాగిత సీతారామాంజనేయులు, వార్డు మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.


## బాలల ప్రతిభ అద్వితీయం : ఎమ్మెల్యే మండలి



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** ఆత్మరక్షణ విద్య అంశాల్లో బాల బాలికల ప్రతిభ అద్వితీయం అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో రాష్ట్రస్థాయి 8వ స్పై ఛాంపియన్ షిప్ పోటీల్లో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించిన బాల, బాలికలను పతకాలతో సత్కరించి అభినందించారు. గాంధీక్షేత్రం ఈశ్వర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులు ఈశ్వర్ మాట్లాడుతూ ఈ నెల 23 వ తేదీ నంధ్యాల ఎన్టీఆర్ షాదీఖానాలో రాష్ట్రస్థాయి 8వ స్పై ఛాంపియన్ షిప్ పోటీలు జరిగినట్లు తెలిపారు. ఈ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 400 మంది విద్యార్థులు వివిధ కేటగిరిలతో పాల్గొన్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో అండర్-14 విభాగంలో బి.శ్రీ కేషిక్ రెండు బంగారు పతకాలు, రెండు రజిత పతకాలు, జి.పూజితవల్లి మూడు బంగారు పతకాలు, ఒక రజిత పతకం, డి.హర్ష వర్ధన్ రెండు రజత పతకాలు పొందినట్లు తెలిపారు. అండర్-11 విభాగంలో కె.జాస్విక ఇషి రెండు బంగారు పతకాలు, కె.ఓజిజ్ఞ రెండు రజత, ఒక కాంస్య పతకాలు, టి.విఖ్యాత్ రామ్ ఒక బంగారు, ఒక రజత, ఒక కాంస్య పతకాలు, టి.అభిషిక్త్ బంగారు పతకం, రజత, ఒక కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. సీనియర్ విభాగంలో కె.భార్గవి బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. జిల్లాకు మొత్తం వివిధ విభాగాల్లో 27 బంగారు పతకాలు, 21 రజత పతకాలు, మూడు కాంస్య పతకాలతో తమ విద్యార్థులు టీమ్ ఛాంపియన్ షిప్ రన్నరప్ సాధించి, జిల్లాలో రెండవ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు తెలిపారు. తద్వారా జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ అభినందించారు. జాతీయస్థాయిలో మరిన్ని పతకాలు సాధించి దివిసీమ కీర్తిని పెంచాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా స్పై మార్షల్ ఆర్ట్స్ సెక్రటరీ పి.విశ్వ, పేరెంట్స్ పాల్గొన్నారు.

# జిల్లాలో ఖాళీగా ఉన్న పదవులను త్వరలో భర్తీ చేస్తాము..






**కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్ :** జిల్లాలో ఖాళీగా ఉన్న 7 సహాయ ఓటరు నమోదు అధికారుల పదవులను త్వరలో భర్తీ చేస్తామని జిల్లా ఎన్నికల అధికారి అయిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి తెలిపారు. గురువారం ఉదయం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ రాష్ట్ర సచివాలయం నుండి జిల్లా ఎన్నికల అధికారులు అయిన జిల్లా కలెక్టర్లతో ఎన్నికల అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాల వారీగా పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ వి.సీ. హాల్ నుండి మాట్లాడుతూ జిల్లాలో 7 సహాయ ఓటరు నమోదు అధికారుల ఖాళీలు ఉన్నాయని, అందులో పెడన, మోపిదేవి, బంటుమిల్లి, కృత్తివెన్ను, కోడూరు, గుడివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో తహసిల్దార్లు లేరన్నారు. కోర్టు తీర్పు వచ్చిందని త్వరలో వాటిని భర్తీ చేస్తామన్నారు. జిల్లాలో 4 రెవెన్యూయేతర ఓటరు నమోదు అధికారులు ఈఆర్వోలు ఉన్నందున వారి స్థానంలో డిప్యూటీ కలెక్టర్ల పేర్లతో ప్రతిపాదనలు పంపించామని వాటిని ఆమోదించాలని కోరారు. జిల్లాలో 73 కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉందని వాటికి బూతు స్థాయి అధికారులను కూడా గుర్తించామన్నారు. ఓటర్ల జాబితా మ్యాపింగు, ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పై ఈఆర్వోలకు, ఏఈఆర్వోలకు ఎన్నికల ఉప తాసిల్దారులకు, సీనియర్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చామన్నారు.

ఓటర్ల జాబితా 15.45 లక్షలకు గాను 6.42 లక్షల ఓటర్ల మ్యాపింగ్ తో 42 శాతం పూర్తిచేశామన్నారు. జిల్లాకు అందిన 1769 బూత్ స్థాయి అధికారుల గుర్తింపు కార్డులను పంపిణీ చేశామన్నారు. జిల్లాలో కేవలం ఒక క్లెయిమ్ ఫారం పరిష్కృతంగా ఉందని దానిని త్వరలో పరిష్కరిస్తామన్నారు. జిల్లాలో 18,136 ఎపిక్ కార్డులు అందగా అందులో ఇప్పటికే 15,849 కార్డులను ఓటర్లకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. మిగిలినవి త్వరలో పంపిణీ చేస్తామన్నారు. బుక్ ఎ కాల్ విత్ బిఎల్ఓ కార్యక్రమానికి సంబంధించి 135 అభ్యర్థనలు రాగా అన్ని పరిష్కరించామ న్నారు. వీడియో కాన్ఫరెన్స్లో డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, మచిలీపట్నం ఆర్డిఓ స్వాతి, డి ఎస్ ఓ మోహన్ బాబు తదితర అధికారులు పాల్గొన్నారు.

# అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలి..

## డిసెంబర్ 5న మెగా తల్లిదండ్రులు ఉపాధ్యాయుల పేరెంట్ టీచర్స్ సమావేశం

### రాష్ట్ర విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి కోన శశిధర్




**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** వచ్చే డిసెంబర్ నెల 5వ తేదీన మెగా తల్లిదండ్రులు ఉపాధ్యాయుల పేరెంట్ టీచర్స్ సమావేశం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని రాష్ట్ర విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి కోన శశిధర్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం ఉదయం రాష్ట్ర విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర సచివాలయం నుండి మెగా తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశం నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ గతంలో మాదిరిగా కాకుండా ఈసారి విద్యార్థుల తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశం డిసెంబర్ 5న కేవలం ప్రభుత్వ విద్యాసంస్థల్లో మాత్రమే నిర్వహించాలన్నారు. అంతేకాకుండా ఈసారి ఉపాధ్యాయులకు కానీ విద్యార్థుల తల్లిదండ్రులకు గాని ఎలాంటి పోటీలు నిర్వహించరాదన్నారు. ఈ సమావేశంలో స్థానిక ప్రజాప్రతినిధులను, విద్యార్థుల తల్లిదండ్రులను తప్పనిసరిగా భాగస్వామ్యం చేయాలన్నారు. ఈ సమావేశానికి వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులకు సంబంధిత విద్యార్థుల హోలిస్టిక్ కార్డులు, అసెస్మెంట్ పుస్తకాలు, బేస్ లైన్ పరీక్షల నివేదికలు అందజేసి వివరించాలన్నారు. విద్యార్థుల చదువుసంధ్యలను తల్లిదండ్రులకు తెలియజేసి వారి సహకారంతో విద్యార్థులు మరింత బాగా చదువుకునే విధంగా ప్రోత్సాహం అందించాలని కోరాలన్నారు. విద్యాసంస్థల్లో ఎక్కడా కూడా రాజకీయ నాయకుల ఫోటోలు గాని బ్యానర్లు గాని ఏర్పాటు చేయరాదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల్లోని గ్రంథాలయ పుస్తకాలను, క్రీడా పరికరాలను, జాదుపితార వస్తువులను విద్యార్థుల తల్లిదండ్రులు చూసే విధంగా ప్రదర్శించాలన్నారు. అలాగే విద్యార్థులు తయారుచేసిన సైన్స్ ప్రాజెక్టులను కూడా ప్రదర్శించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలను జిల్లా కలెక్టర్లు సందర్శించినప్పుడు మధ్యాహ్న భోజనంతో పాటు విద్యార్థుల అసెస్మెంట్ పుస్తకాలను కూడా పరిశీలించి బాగా చదువుకునేందుకు తగు సూచనలు ఇవ్వాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ నగరంలోని వారి క్యాంపు కార్యాలయం నుండి పాల్గొనగా జిల్లా విద్యాధికారి కార్యాలయ పర్యవేక్షకులు పవన్ కుమార్, సమగ్ర శిక్ష కార్యాలయ సీఎంఓ రమేష్, జిల్లా ఇంటర్మీడియట్ అకాడమిక్ గైడెన్స్ మానిటరింగ్ సెల్ ఇన్చార్జి పి నాగ రవి పాల్గొన్నారు.

# పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి

## పరిశ్రమల స్థాపనకు తక్షణ అనుమతులు

### జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ




**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ యువతకు పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక మండలి సమావేశం జరిగింది. సమావేశంలో అజెండా అంశాలు, పెండింగ్ దరఖాస్తుల పురోగతి, సమస్యలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుకు కృష్ణాజిల్లా అనువైన ప్రాంతమని పేర్కొంటూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించిన అనుమతులన్నీ సింగిల్ విండో పద్ధతిలో తక్షణ అనుమతులు మంజూరు చేస్తామన్నారు. పరిశ్రమలు పెట్టిన వారికి వివిధ ప్రభుత్వ రాయితీలు కల్పిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బ్యాంకుల వద్ద పెండింగ్ లో ఉన్న పీఎం విశ్వకర్మ యోజన, ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ పిఎంఈజీపి పథకాల దరఖాస్తులను తక్షణం పరిష్కరించి రుణాలు మంజూరు చేయాలని చెబుతూ, అదేవిధంగా యూనిట్లు కూడా గ్రౌండ్ అయ్యేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పిఎంఈజీపి పథకం కింద వచ్చిన 120 దరఖాస్తులకు గానూ కేవలం 30 మంది లబ్ధిదారులకు మాత్రమే రుణాలు మంజూరు చేశారని, వచ్చే సమావేశం నాటికి అవి పెండింగ్లో ఉండకూడదని బ్యాంక్ అధికారులకు చెప్పారు. పరిశ్రమల ఏర్పాట్లలో మౌలిక వసతులకు సంబంధించి ఆయా డిపార్ట్మెంట్ల వద్దకు వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచిస్తూ, ప్రస్తుతం లీగల్ మెట్రాలజీ 18 దరఖాస్తులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ 14, ఏపీఐఐసీ 13, గ్రౌండ్ వాటర్ 3 దరఖాస్తులు అత్యధికంగా పెండింగ్లో ఉన్నాయని, ఆయా దరఖాస్తులను నిర్ణీత సమయానికి పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో పరిశ్రమలకు సంబంధించి 26 యూనిట్లకు దాదాపు రూ.4.30 కోట్లు రాయితీలు మంజూరు చేసినట్లు కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ ఆర్ వెంకట్రావు, అగ్నిమాపక శాఖ అధికారి ఏసురత్నం, మార్కెటింగ్ శాఖ ఏడి ఎల్ నిత్యానంద్, నగర మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, జిల్లా పంచాయతీ, డి ఆర్ డి ఏ, విద్యుత్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నూతన మున్సిపల్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జనసేన నాయకులు



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** కొండపల్లి మున్సిపాలిటి నూతన కమిషనర్ గా నియమితులైన వెంకట రత్నంను మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో జనసేన నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ అధ్యక్షులు చెరుకుమల్లి సురేష్, సెంట్రల్ ఆంధ్రా ప్రచార కమిటీ సభ్యుడు యర్రంశెట్టి నాని, అశోక్ బాబీ, రాగాల నాని,యర్రంశెట్టి సాయి, బొమ్మల రమేష్,కమల్ వెంకటేశ్వరావు,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ




**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** బాల్యవివాహాల వలన జరుగుతున్న నష్టాలను వివరిస్తూ వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో బాలికలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాల్యవివాహాలు లేని భారతదేశ నిర్మించుకుందాం బాల్యవివాహాలపై అవగాహన 100 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినిలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం సి ఎస్ డబ్ల్యు సిహెచ్. శాంతి ఆధ్వర్యంలో బాల్యవివాహాలకు వ్యతిరేకంగా పుస్తెల తాడు వద్దు, పుస్తకాలు ముద్దు, బాల్య వివాహాలు అరికడదాం అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బీసీ కళాశాల బాలికల వసతి గృహంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్త ప్రేమలత, ఇన్చార్జి హెచ్ఎం తదితరులు పాల్గొన్నారు.

## షోడా సత్యం పెద్దకర్మలో నివాళులర్పించిన లంక లితీష్



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మైలవరం లోని తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త సోడా సత్యం పెద్దకర్మ సందర్భంగా బుధవారం తెలుగు యువత అధ్యక్షులు లంక లితీష్, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మైలవరం మండల తెలుగుదేశం పార్టీ కార్యదర్శి దూరు బాలకృష్ణ, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జల్లి కృష్ణ,షాహన బేగం, మైనార్టీ నాయకులు షేక్ బాజీ, బిఎస్ఎన్ఎల్ అభివృద్ధి డైరెక్టర్ మైక్ బాబు రావు, నూతక్కి. సతీష్, ఎక్స్ వార్డ్ మెంబర్ వడపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

## నిశ్చియ తాంబూలాల వేడుకలలో జంపాల



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** విజయవాడ రూరల్ గొల్లపూడి గ్రామానికి చెందిన అడుసుమల్లి నారాయణరావు-మాధవి కుమార్తె చిరంజీవి అనూష నిశ్చితార్థం గొంది బాల గంగాధర ప్రసాద్- తులసి కుమారుడు వెంకట హేమంత్ తో గురువారం ఉదయం ఘనంగా జరిగింది. గుంటుపల్లి సిఏ కన్వెన్షన్ హాల్లో జరిగిన కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. అత్యంత వైభవంగా వివాహం జరిగి నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో చల్లగా ఉండాలని దీవించారు.

# పాత ఆర్ఆర్ పేటలో బబుల్స్ ద్వారా తాగునీరు పంపిణీ చేయండి








**విజయవాడ కార్పొరేషన్, నవంబర్ 27, మేజర్ న్యూస్ :** విజయవాడ అర్బన్ పాత రాజరాజేశ్వరి పేటలో బబుల్స్ ద్వారా శుద్ధమైన తాగునీరు పంపిణీ చేయాలని.. ప్రతిరోజూ కచ్చితంగా తాగునీటి పరీక్షలు నిర్వహించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు.

గురువారం సా యంత్రం పాత రాజరాజేశ్వరిపేటలో పర్యటించి క్షేత్రస్థాయిలో తాగునీటి సర ఫరా నాణ్యతను కమిషనర్ పరిశీలించారు. అక్కడ సరఫరా అవుతున్న తాగు నీరు ఎలా ఉందనే దాన్ని స్వయంగా పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి తాగు నీటి సరఫరా ఎలా ఉంది, రంగు మారిన నీరు ఏమైనా వస్తుందా? అని అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరా అయ్యే పైపులైన్లను మార్చి, కొత్త పైపులై న్లు వేసే పనులను పరిశీలించారు. ఆ ప్రాంతంలో నివసిస్తున్న వారికి పైపులైన్ల ద్వారా తాగునీటి సరఫరా వెంటనే ఆపమని, బుబుల్స్ ద్వారా శుద్ధమైన తాగు నీటిని పంపిణీ చేయాలని ఆదేశించారు.

పాత రాజరాజేశ్వరిపేటలో ఇంటింటి ఆరోగ్య సర్వే నిర్వహించి, ఎటువంటి అనారోగ్య సమస్యలు ఉన్నా వెంటనే నివే దిక ఇవ్వాలని, అక్కడ నివసిస్తున్న ప్రజలకు ఎటువంటి అనారోగ్య సమస్యలు ఉన్నా ప్రథమ చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరాపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని.. నిర్లక్ష్యం అనేది ఎక్కడా కని పించకూడదని హెచ్చరించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కె.ప్రభుదా స్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె.శ్రీనివాస్, మెడికల్ హెల్త్ ఆఫీసర్ డా. అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



## తిరుమల లడ్డులో కల్తీ నెయ్యి వినియోగించినట్లు సిట్ విచారణలో తేలింది

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు గొర్రెపాటి గోపీచంద్, బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్ గురువారం సిడింబి అగ్రహారంలో మీడియా సమావేశం నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో గత వైసిపి పాలనలో జరిగిన అవినీతిపై జగన్మోహన్ రెడ్డి, ఆయన బంధువుల పాత్ర పై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.వైసిపి నాయకులు శ్రీవారి ప్రసాదాలు, ఆస్తులు, నిర్మాణాల్లోనూ భారీ అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. పవిత్రమైన తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగించడం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. సిట్ నివేదికలలో, విచారణలో కూడా వాస్తవాలు బయటకు వస్తున్నాయన్నారు. శ్రీవారి భక్తులు విశ్వాసంతో స్వీకరించే ప్రసాదాల్లోనూ కల్తీ చేసినా కూడా వదిలేయాలా ? అని ప్రశ్నించారు. పరకామణి కేసులో ఎందుకు సంబంధం లేదో చెప్పాలన్నారు.హైకోర్టు కూడా తప్పు బట్టి సిట్ విచారణకు ఆదేశించిందని తెలిపారు. తప్పు చేసిన వారందరినీ చట్టం ముందు కూటమి ప్రభుత్వం నిలబెడుతుందన్నారు. ఎన్టీఆర్, చంద్రబాబు పాలనలో టీటీడీ పవిత్రతను కాపాడారన్నారు. వైసీపీ పాలనలో టీటీడీలో జరిగిన అక్రమాలు బయటకు తీసి కారకుల పై చట్టపరమైన చర్యలు తీసుకునే బాధ్యత కూటమి ప్రభుత్వానిదని స్పష్టం చేశారు. టిడిపి నాయకులు పి.నాగరాజు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద నిరోధక అవగాహన కార్యక్రమం నిర్వహించిన వీఎంసీ ఫైర్ ఆఫీసర్స్



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్:** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు అగ్ని ప్రమాదాలను నిరోధించడానికి గురువారం ఉదయం అజిత్ సింగ్ నగర్ లో ఉన్న రవీంద్ర సినిమాస్ ను ఆకస్మిక తనిఖీ చేసారు వి యం సి సిబ్బంది. ఈ కార్యక్రమంలో అగ్ని ప్రమాదం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన నిరోధక చర్యలు, అగ్ని ప్రమాద నిరోధక పరికరాలను ఉపయోగించు విధానము, అగ్ని ప్రమాదం జరిగినప్పుడు మంటలను ఎలా అర్పాలి, ఎటువంటి పరికరాలను ఉపయోగించాలి, ఫైర్ స్ప్రింక్లర్స్, స్మోక్ డిటెక్టర్స్, ఎక్కడెక్కడ అమర్చాలి, వాటి వలన స్మోక్ అలారం ఎలా వస్తుంది, అగ్ని ప్రమాదం జరగకుండా కాంప్లెక్స్ చుట్టూ ఫైర్ సేఫ్టీ మెజర్స్ ఏమేం ఉండాలి వంటి విషయాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మల్యాద్రి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ కె. నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## గుడ్లవల్లేరు మండల పరిషత్ సమావేశం సాధారణం



గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ నవంబరు 27 : కట్టవాని చెర్వు, చింతలగుంట గ్రామాల్లో 50 మంది విద్యార్థులు వున్నా పాఠశాల భవనం లేదంటూ కట్టవానిచెర్వు సర్పంచ్ బొట్ల వీరమ్మ, కౌతరంలో 30 లక్షలతో వాటర్ వర్క్స్ మరమ్మతులు చేసినా ఉపయోగం లేదు త్రాగునీరు బాగోలేదంటూ రేపు మండలానికి తీసుకురమ్మంటారా అంటూ ఎంపిటిసి చీర దుర్గా భవాని, అంగన్వాడీ కేంద్ర భవనాల మంజూరు ఎన్నాళ్ళకు వస్తాయంటూ చినగొన్నూరు సర్పంచ్ కోటప్రోలు నాగు తదితరుల ఆవేదన వ్యక్తం చేసారు. గురువారం ఎంపిపి కొడాలి సురేష్ అధ్యక్షతన జరిగిన గుడ్లవల్లేరు మండల పరిషత్ సాధారణ సమావేశంలో ప్రజాప్రతినిధులు పలు ప్రజా సమస్యలపై ప్రశ్నలు లేవనెత్తుతూ వివిధ శాఖల అధికారుల సమాధానాలపై అసంతృప్తి వ్యక్తం చేసారు. ఎంపిడిఓ ఎండి ఇమ్రాన్ సమన్వయం చేస్తూ అధికారులు సమగ్ర సమాచారం చెప్పాలని, ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయం తో ప్రజా సమస్యలు పరిష్కరిద్దామన్నారు.వ్యవసాయ, ఇరిగేషన్, డ్రైనేజీ, ఆర్టీసీ, డిఆర్డిఏ, ఎన్ఆర్జీఎస్, మహిళా సంక్షేమం, పోలీసు, తదితర శాఖల అధికారులు ప్రగతిని నివేదించారు. ఎస్ఐ ఎన్ వి వి సత్యనారాయణ బాల్య వివాహాలు, సైబర్ నేరాల పై అవగాహన చేసారు. బెల్టు షాపులు విచ్చలవిడిగా గుడ్లవల్లేరు సెంటరులో, గ్రామాల్లో అమ్మకాలపై ఎక్సైజ్ అధికారిపై, పాఠశాల భవనాల నిర్మాణాలపై విద్యాశాఖాధికారి సమాధానాలపై ప్రజా ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం బాల్య వివాహాల నివారణకు ప్రతిజ్ఞ చేసారు. కార్యక్రమంలో తహశీల్దార్ లోకరాజు, ఇన్చార్జ్ సిడిపిఓ పద్మావతి, సూపర్వైజర్ నసీరున్నీసా, కార్యదర్శులు ఎజెఎల్ నరసింహారావు తదితరులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు కాకులపాడులో ప్రజా దర్బార్



**హనుమాన్ జంక్షన్ మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని శుక్రవారం బాపులపాడు మండలం కాకులపాడు గ్రామంలో నిర్వహించనున్నట్లు గన్నవరం ఎమ్మెల్యే కార్యాలయం నుంచి గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు కాకులపాడు గ్రామంలోని కళ్యాణమండపంలో ఈ ప్రజా దర్బార్ నిర్వహించనున్నట్లు తెలిపారు.ప్రభుత్వ విప్,గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో జరిగే ఈ ప్రజా దర్బార్లో ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో ఎమ్మెల్యేకు అందజేసి వాటికి పరిష్కారాన్ని పొందాలని కార్యాలయం ప్రకటించింది.అలాగే శుక్రవారం సాయంత్రం కాకులపాడు సొసైటీ లో ఎమ్మెల్యే యార్లగడ్డ చేతుల మీదుగా రైతులకు బోనస్ లు పంపిణీ చేయనున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## బాల్య వివాహాల్ని వ్యతిరేకిద్దాం



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ నవంబరు 27 :** బాల్య వివాహాల్ని అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకించాలని ఎంపీ వల్లభనేని బాలశౌరీతో పాటు వెనిగండ్ల రాము పిలుపునిచ్చారు. మండలంలోని వెణుతురుమల్లి, గుడ్లవల్లేరులో గురువారం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ఎంపీ, ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, ఎస్.ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ శాయన పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.

# పారిశ్రామిక శాంతి, పెట్టుబడులకు ఏపీ అనువైన వాతావరణం



**విజయవాడ నవంబర్27 మేజర్ న్యూస్ :** హోటల్ ఆయత్‌లో కొత్త లేబర్ కోడ్స్ అవగాహన సదస్సులో ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కార్మిక శాఖ లేబర్ కమిషనర్ & సెక్రటరీ శేషగిరి బాబుతో కలిసి గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రాష్ట్రంలోని కార్మికుల సంక్షేమం, పరిశ్రమలు – ఉద్యోగుల హక్కుల పరిరక్షణ,, కేంద్ర లేబర్ కోడ్స్ అమలుపై కీలక విషయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకొని, కేంద్రం తీసుకువచ్చిన సామాజిక భద్రత కోడ్ 2020, పారిశ్రామిక వివాదాల కోడ్, వేతనాల కోడ్, ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్ & వర్కింగ్ కండిషన్స్ కోడ్ అమలులో ముందంజలో ఉందన్నారు. అసంఘటిత రంగం, గిగ్–ప్లాట్‌ఫామ్ వర్కర్లను సామాజిక భద్రత కిందకు తీసుకురావడం ద్వారా లక్షలాది కార్మికులకు రక్షణ లభిస్తుందని చెప్పారు. "ప్రతి కార్మికుడికి సమాన వేతనం, సకాలంలో వేతనం,, సురక్షితమైన పని వాతావరణం కల్పించడం మా లక్ష్యం" అని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగుల కోసం మాతృత్వ సెలవులు, వర్క్ ఫ్రం హోమ్ సౌకర్యాలు, రాత్రిపూట పని అనుమతులు వంటి సంస్కరణలు మహిళల సాధికారతకు ఉపయోగపడుతున్నా యని చెప్పారు. పరిశ్రమలతో సమన్వయం పెంచి, ఉద్యోగావకాశాలు, పెట్టుబడులు పెరిగేలా అడుగులు వేస్తున్నామని తెలిపారు. అదే విధంగా లేబర్ కమిషనర్ & సెక్రటరీ శేషగిరి బాబు మాట్లాడుతూ కార్మికుల కోసం రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర సోషల్ సెక్యూరిటీ ఫ్రేమ్‌వర్క్ అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రతి సంస్థలో హెల్త్ చెకప్‌లు, సేఫ్టీ కమిటీలు, అపాయింట్‌మెంట్ లెటర్లు తప్పనిసరి చేస్తున్నామని తెలిపారు. వలస కార్మికుల కోసం జర్నీ అలవెన్స్, పిడిఎస్ పోర్టబిలిటీ, నిర్మాణ కార్మికుల ప్రయోజనాల పోర్టబిలిటీ అమలులో ఉన్నాయని చెప్పారు. డిజిటల్ మీడియా వర్కర్లు, డబ్బింగ్ ఆర్టిస్టులు కూడా ఈ కొత్త కోడ్ల కింద రక్షణ పొందుతున్నారని వివరించారు. ఉద్యోగాల తొలగింపులో రీ–స్కిల్లింగ్ ఫండ్ ద్వారా కార్మికులకు తక్షణ సహాయం అందించే విధానం అమల్లో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ అడిషనల్ సెక్రెటరీ గంధం చంద్రుడు, జెసిఎల్ లక్ష్మీనారాయణ, ఆశారాణి, ఫ్యాక్టరీస్ డైరెక్టర్ మోహన్ రావు, కార్మిక శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ప్రతిభకు వైకల్యం అడ్డుకారాదు..

ప్రతిభావంతులలో మనోధైర్యాన్ని పెంచేందుకు క్రీడలు..

జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ.








**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్ :** వైకల్యమనేది మనిషికే గాని మనసుకు కాదని ప్రతిభ ముందు వైకల్యం చిన్నబోతుందని క్రీడాలలో రాణించడం ద్వారా విభిన్న ప్రతిభవంతులు సకలాంగులకు దీటుగా సత్తాను చాటాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభవంతుల దినోత్సవం పురస్కరించుకొని జిల్లా విభిన్న ప్రతిభావంతుల హిజ్రాలు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన క్రీడా పోటీలలను జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ప్రారంభించారు. తొలుత జిల్లా కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి క్రీడాకారుల నుండి గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని వారితో ముచ్చటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వైకల్యమనేది మనిషికే గాని మనస్సుకు కాదన్నారు. సహజంగా సకలాంగులకంటే విభిన్న ప్రతిభావంతులో నూనసిక స్థితి ఎంతో దృడంగా ఉంటుందన్నారు. విభిన్న ప్రతిభావంతులలకు అవసరమైన తోడ్పాటును అందిస్తే ఎటువంటి విజయాలనైన సొంతం చేసుకుంటారని ఇటీవల జరిగిన ఆంధుల తొలి టీ20 ప్రపంచ కప్ క్రికెట్ పోటీలలో మన దేశం విజయం సాదించడమే ఇందుకు నిదర్శనం అన్నారు. భారత్ జట్టులో స్థానం పొంది విజయంలో కీలక పాత్ర పోషించిన క్రికెటర్లు టి.దీపిక కరుణ కుమారిలను ఆదర్శంగా తీసుకుని క్రీడలలో రాణించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రతిభావంతులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడంతో పాటు మానసిక స్థైర్యాన్ని నింపేందుకు ఇటువంటి క్రీడా పోటీలు ఎంతో దోహదపడతాయన్నారు. వైకల్యాన్ని గురించి ఆలోచించక క్రీడాలలో రాణించడం ద్వారా విభిన్న ప్రతిభావంతుడు ఆత్మస్థైర్యాన్ని పెంచుకోవాలని కలెక్టర్ కోరారు. పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరు విజేయతగా భావించాలన్నారు. సమాజంలో అన్ని రంగాలలో రాణించేలా విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. విభిన్న ప్రతిభావంతుల వయోవృద్ధులు సహకార కార్పొరేషన్ చైర్మన్ జి. నారాయణ స్వామి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు సకలాంగులతో సమానంగా జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేలా ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ప్రభుత్వం అనులు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అందిపుచ్చుకుని రాణించడం ద్వారా మనోధైర్యాన్ని పెంచుకోవాలని సూచించారు. జిల్లా స్థాయి క్రీడా పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర అంతర్జాతీయ స్థాయిలోనూ విజేతలుగా నిలిచేలా అధికారులు విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించాలని తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు అవసరమైన సహకారం అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాలకులు వి. కామరాజు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు జిల్లా స్థాయిలో జూనియర్ సీనియర్ మహిళలు, పురుషుల విభాగాలలో చెస్, క్యారమ్స్, సాఫ్ట్ బాల్, వాలీబాల్, రన్నింగ్, ట్రై సైకిల్ రేస్, షాట్పుట్, డిస్టర్స్ త్రో వంటి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 300 మందికి పైగా విభిన్న ప్రతిభావంతులు పోటీలలో పాల్గొంటున్నట్లు తెలిపారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ పర్యవేక్షకులు ప్రశాంతి, విభిన్న ప్రతిభావంతులు బాలికల వసతి గృహం, మెడోన్నా మూగ బదిరల కళాశాల, మానసిక వికాస కేంద్రం, ప్రేమ వికాస్, అంకిత చారిటబుల్ ట్రస్ట్, సెయింట్ అన్ని సొసైటీ ప్రేమ్ నికేతనని స్కూల్, సత్యసాయి చేయూత సొసైటీ, జీవజ్యోతి రెసిడెన్సిల్ స్కూల్, శ్రీ విద్య సోషల్ సర్వీస్ స్కూల్, మెర్ల రామమ్మ మెమోరియల్ ట్రస్ట్, శిరిష రహబిలిటీషన్ సెంటర్, కెడివి ట్రస్ట్, విజయ మేరీ ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఫర్ బ్లైండ్లకు చెందిన క్రీడాకారులు పలు క్రీడా పోటీలలో పాల్గొన్నారు. కారక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి (డీఎస్డీవో) కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## దళారులను నమ్మి రైతన్నలు నష్టపోవద్దు

### ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ నవంబరు 27 :** ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు అపోహలకు పోయి...దళారులను నమ్మి మోసపోవద్దని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గుడ్లవల్లేరులో 'రైతన్న - మీకోసం' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించిన ఎమ్మెల్యే రాము గ్రామాల్లో పర్యటిస్తూ రైతాంగ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ధాన్యం విక్రయాలకు....నేరుగా మిల్లర్ల వద్దకు వెళ్లి నష్టపోవద్దన్నారు. ఆర్ఎస్కే, కస్టోడియన్ అధికారి ద్వారానే....రైతులు మిల్లులకు వెళ్లాలని సూచించారు. తేమ శాతంలో మిల్లర్లు మాయాజాలం చేస్తే... ప్రభుత్వ వ్యవస్థలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. రైతులకు 'రైతన్న సేవలో - మన మంచి ప్రభుత్వం' కరపత్రాలు పంపిణీ చేశారు. రోడ్ల వెంబడి దాన్యపు రాశులను అరబెడుతున్న రైతులు, రైస్ మిల్లుల వద్ద ధాన్యం విక్రయిస్తున్న రైతాంగంతో మాట్లాడుతూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలువురు రైతులు మధ్యవర్తుల ద్వారా రైస్ మిల్లులకు ధాన్యం విక్రయించడాన్ని గుర్తించిన ఎమ్మెల్యే వారితో మాట్లాడారు. ప్రభుత్వం కొనుగోలు చేయదేమోనన్న ఆలోచనతో తాము ధాన్యం మధ్యవర్తుల ద్వారా విక్రయిస్తున్నామని రైతులు చెప్పడంతో, ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వారికి ఎమ్మెల్యే రాము వివరించారు. ఈ సందర్భంగా రైతులకు 'రైతన్న సేవలో మన మంచి ప్రభుత్వం' కరపత్రాలను ఎమ్మెల్యే రాము పంపిణీ చేశారు. అవగాహన లేక అపోహలతోనే చాలామంది రైతులు దళారులను ఆశ్రయిస్తుండటాన్ని గుర్తించామన్నారు. రైతు సేవా కేంద్రం వద్ద నిర్దేశించిన తేమ శాతం, మిల్లర్‌కు మధ్య వ్యత్యాసం ఉంటే రైతులు ఆందోళన చెందనవసరం లేదన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి మిల్లు వద్ద కస్టోడియన్ ఆఫీసర్‌ను ప్రభుత్వం నియమించిందన్నారు. తేమశాతంపై ఇబ్బందులు వస్తే ప్రభుత్వం నియమించిన కస్టోడియన్ ఆఫీసర్ దష్టికి తీసుకువెళ్తే ఆయన రైతుకు సహాయంగా పని చేస్తారన్నారు. ఇబ్బందులు వస్తే ప్రభుత్వ వ్యవస్థలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధికారులు పని ఒత్తిడిలో ఉన్నా... రైతాంగ సమస్యలను పరిష్కరించే దిశగా చొరవ తీసుకోవాలని సూచించారు. ప్రజా ప్రతినిధిగా తాను అన్నిచోట్లకు వెళ్లలేకపోయినా, సమస్యలు వస్తే రైతాంగం స్థానిక నాయకత్వం దష్టికి తీసుకువస్తే తాము సమస్యా పరిష్కారానికి కషి చేస్తామన్నారు. ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ కొసరాజు బాపయ్య చౌదరి, ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవి, చేకూరు జగన్ మోహన్ రావు, పోలవరపు వెంకట్రావు, గుడ్లవల్లేరు సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, శ్రీ కొండలమ్మ ఆలయ చైర్మన్ ఈడే మోహన్, తహసీల్దార్ బి.లోకరాజు, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



### దివిసీమ ఆత్మబంధువు మండలి వెంకటకృష్ణారావు శత జయంతి వేడుక లు ఘనంగా నిర్వహించారు

**కోడూరు మేజర్ న్యూస్ :** కూటమి నాయకులు కృష్ణారావుకి ఘన నివాళు లు గురువారం కోడూరు ప్రధాన సెంటర్లో కృష్ణారావు విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించి బడే బావన్నారాయన, రేపల్లె పిచ్చే పిచ్చేశ్వరరావు, ఈ కార్యక్రమంలో కోడూరు పిఎసిఎస్ చైర్మన్ పోతబోయిన కరుణ కుమార్, కడవకొల్లు శ్రీనివాసరావు, కోడూరు నీటి సంఘాల వైస్ చైర్మన్ బచ్చు పూర్ణచంద్రరావు, మాజీ డిసి వైస్ చైర్మన్ కాగిత రామారావు, విసంశెట్టి సాయిబాబు, జరుగు కిరణ్ బాబు, మంగళగిరి శ్రీనివాసరావు, మల్ల వెంకటేశ్వరరావు, బడే కృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

### కొండలమ్మను దర్శించుకున్న వెటర్నరీ జేడీ నరసింహులు



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** మండలంలోని వేమవరంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారిని గురువారం జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎన్‌సీహెచ్ నరసింహులుతో పాటు అసిస్టెంట్ డైరెక్టర్లు డాక్టర్ ఎం.జగన్నాధరావు, డాక్టర్ వి.హనుమంతరావు దర్శించుకున్నారు. దేవస్థాన చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్‌రావు, ఈవో ఆకుల కొండలరావు వారిని శ్రీఅమ్మవారి శేష వస్త్రములతో సత్కరించారు.

### రాంబాబు ఆకస్మిక మరణం తీరనిలోటు : యార్లగడ్డ



**హనుమాన్ జంక్షన్ మేజర్ న్యూస్ :** బాపులపాడు మండలం రేమల్లె గ్రామ మాజీ ఉపసర్పంచ్ వడ్లపట్ల శివరామకృష్ణ(రాంబాబు) గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. మృతునికి భార్య, ఆడపిల్ల ఉన్నారు.రాంబాబు బుధవారం ఉదయం రెమల్లెలో ఇంటి వద్ద అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు వైద్య చికిత్స నిమిత్తం హనుమాన్ జంక్షన్ కు తరలించేందుకు ప్రయత్నించగా అప్పటికే మృతి చెందారు.రాంబాబు మరణ వార్త తెలుసుకున్న యార్లగడ్డ రేమల్లె గ్రామానికి చేరుకొని రాంబాబు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. తెలుగుదేశం పార్టీకి అంకితభావంతో పనిచేసిన రాంబాబు మృతి పార్టీకి తీరనిలోటు అని అంకితభావంతో పనిచేసే ఆయనను కోల్పోవడం బాధాకరమని యార్లగడ్డ అన్నారు. రాంబాబు మృతదేహం పై తెలుగుదేశం జెండా కప్పి పార్టీ తరుపున నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గూడపాటి తులసి మోహన్, పుట్టా సురేష్, కలపాల సూర్యనారాయణ (పింకు), కలపాల చంటి, కొల్లూరు చంద్రహాస్, గుడివాడ విజయానంద్, చలసాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### పొడి చెత్తకు నిత్యావసరాలు



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ నవంబరు 27 :** మండల పరిధిలోని ఉలవలపూడి గ్రామ పంచాయతీలో స్వచ్ఛ రథం ద్వారా గురు వారం పొడి చెత్తకు గహ ఉపకరణకు సంబంధించిన నిత్యా వసర వస్తువులను అందజేశారు. ఈ స్వచ్ఛ రథం ద్వారా గ్రామస్తులు ఎందుకు ఉపయోగం లేని వస్తువులు స్క్రాప్ ఇచ్చి నిత్యవసర వస్తువులు పొందారు. పనికి రాని ప్లాస్టిక్ ఇతర వస్తువులు ఎక్కడపడితే అక్కడ వెయ్యకుండా స్వచ్ఛ రథానికి అందించడం ద్వారా నిత్య వసర వస్తువులు పొందవచ్చు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పామర్తి కన్య భాస్కరరావు, గ్రామ కార్యదర్శి వాసవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

### మానసిక ఆరోగ్య సమస్యలపై అవగాహన

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మండలం కవులూరు గ్రామంలో గురువారం మానసిక అనారోగ్య సమస్యలపై గ్రామస్తులకు యువతకు,వాసవ్య మహిళా మండలి వారి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రాజెక్టు కోఆర్డినేటరు టి. కేశవ మాట్లాడుతూ మానసిక అనారోగ్యాలు అయిన డిప్రెషన్ ఆందోళన స్కిజోఫ్రీనియా, మత్తు పదార్థాలకు బానిస అవటం వంటి వ్యాధుల్లో యొక్క లక్షణాలు మరియు నిర్వహణ విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను, క్రమం తప్పకుండా డాక్టర్ సూచించిన మేరకు మందులు వాడితే ఎటువంటి ప్రయోజనాలు ఉంటాయి అని వివరించడం జరిగింది. ప్రాజెక్టు కౌన్సిలర్ శ్రీమతి ఎం ఝాన్సీ మాట్లాడుతూ మానసిక అనారోగ్యం నుంచి బయటపడటానికి రోగి యొక్క సంరక్షకుల పాత్ర ఎంతో కీలకమని మానసిక సమస్యలు ఎవరికైనా రావచ్చు అని కానీ తోడ్పాటున అందించటం అనేది చాలా ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు సిబ్బంది బట్టపర్తి స్వాతి ప్రియాంక,అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో కనెక్టివిటీ రహదారుల నిర్మాణానికి రూ.2వేల కోట్ల మంజూరు



### ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతో గుడ్లవల్లేరులో విస్తృతంగా పర్యటించిన ఎంపీ
### పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎంపీ బాలసౌరి, ఎమ్మెల్యే రాము
### కూటమి ప్రభుత్వంలో ప్రగతి పథంలో గ్రామాలు: ఎమ్మెల్యే రాము



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఎంపీ వల్లభనేని బాలసౌరి పేర్కొన్నారు. 4వేల కోట్ల ఎనర్జీఎస్ నిధులతో గ్రామాల్లో రహదారులు అభివృద్ధి పరిచామని, గ్రామాల కనెక్టివిటీ రహదారుల నిర్మాణానికి 2వేల కోట్ల నిధులు బడ్జెట్లో మంజూరు కానున్నట్లు ఆయన చెప్పారు. గుడ్లవల్లేరు మండలంలో ఎంపీ వల్లభనేని బాలసౌరి గురువారం విస్తృతంగా పర్యటించారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, కూటమి నేతలతో కలిసి ఆయన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ముందుగా మండలంలోని పశుబోట్లవానిపాలెం గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ గర్భకోస వ్యాధుల చికిత్స శిబిరాన్ని ప్రారంభించిన ఎంపీ వల్లభనేని బాలసౌరి, ఎమ్మెల్యే రాము పాడి రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లు, డి వార్మిషన్ మందులు పంపిణీ చేశారు. అనంతరం వెనుతురుమిల్లి గ్రామంలో ఎనర్జీఎస్ విధులు రూ.16.09 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు,రూ. ఐదు లక్షల నిధులతో ఏర్పాటుచేసిన ఆర్వో వాటర్ ప్లాంట్, దేశాయిపేట గ్రామంలో రూ.16 లక్షల ఎనర్జీఎస్ నిధులతో నిర్మించిన అంతర్గత రహదారులను ఎంపీ బాలసౌరి, ఎమ్మెల్యే రాము, సర్పంచ్ కొప్పినేని శేషవేణి, ప్రారంభించారు. ఈ సందర్భంగా వెణుతురుమిల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో ఎంపీ బాలసౌరి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎనర్జీఎస్ నిధులను పక్కదారి పట్టించేద న్నారు. రోడ్ల సమస్య తీవ్రతను గుర్తించిన సీఎం, డిప్యూటీ సీఎంల చొరవతో 4వేల కోట్ల నిధులతో గ్రామాల్లో రోడ్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయ న్నారు. రైతులు ఎదుర్కొంటున్న డొంక రోడ్ల సమస్యలను డిప్యూటీ సీఎం పవన్ దృష్టికి తీసుకెళ్లామని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారన్నారు. గ్రామాల్లో కనెక్టివిటీ రోడ్ల నిర్మాణానికి త్వరలో జీవో రానుందనీ ఆయన అన్నారు. బడ్జెట్ లో 2వేల కోట్లు మంజూరు కానున్నాయను, పేర్కొన్న ఎంపీ బాలసౌరి మచిలీపట్నం పార్లమెంట్ కు 60కోట్లు మంజూరు కానున్నాయని చెప్పారు. గ్రామాల్లో రోడ్ల అభివృద్ధితోపాటు, ప్రతి ఇంటికి సురక్షిత త్రాగునీరు అందించడమే లక్ష్యంగా జాతీయస్థాయిలో కృషి చేస్తున్నానని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ అందరి భాగస్వామ్యంతో నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తున్నానని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు గ్రామాల అభివృద్ధిని పూర్తిగా పక్కన పెట్టేశాయని, సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం గ్రామాల అభ్యున్నతికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే అన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో కేంద్ర రాష్ట్ర నిధులతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులతో గ్రామాలు ప్రగతి పథంలోకి దూసుకెళ్తున్నాయని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఎంపీ బాలసౌరి సహకారంతో గుడివాడ నియోజకవర్గం లో అనేక కేంద్ర ప్రాజెక్టులు మంజూరైనట్లు ఎమ్మెల్యే రాము చెప్పారు.

ఈ కార్యక్రమాల్లో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, గుడివాడ జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, గుడ్లవల్లేరు టిడిపి అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి, మార్కెట్ యార్డ్ చైర్మన్ పొట్లూరి రవి, టిడిపి నాయకులు సాయన పుష్పావతి,చేకూరు జగన్ మోహన్ రావు, నిమ్మగడ్డ సత్యసాయి, పోలవరపు వెంకట్రావు,యుగంధర్, వల్లభనేని సుబ్బారావు, వల్లభనేని రంగబాబు, అడుసుమిల్లి చిట్టిబాబు, ఈడే మోహన్, ఈడే కృష్ణారావు, ఆంజనేయులు,కాగిత నరేంద్ర, సత్తార్, తెల్లాకుల నాగలక్ష్మి, మన్యం పద్మావతి, తుమ్ము పద్మజ, మల్లి... జనసేన నాయకులు పేర్ని జగన్, తోట చిన్నారి, తూము వెంకటరత్నం, సాయన నాని, చందన వెంకటరాజు, గుడివాడ పట్టణ జనసేన అధ్యక్షుడు మజ్జి శ్రీనివాస్, గుడివాడ జనసేన నాయకులు సాయన రాజేష్, వేమూరి త్రినాథ్ వెణుతురుమిల్లి గ్రామ నాయకులు కోప్పినేని పిచ్చేశ్వరరావు, పాగోలు అనిల్ కుమార్, చందన వెంకటరాజు, పోతులు గణేష్, పామర్తి సత్యనారాయణ, కాగిత హరిబాబు, బొజ్జ ప్రభాకర్, చందన ఫణి, తాసిల్దార్ లోక రాజు,వెటర్నరీ శాఖ జెడి నరసింహారావు, డిడి శ్రీనివాసరావు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు కూటమి నాయకులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# హెల్త్ కార్డులపై కమిటీ ఏర్పాటుపై ఎన్జీజివో సంఘం హర్షం

### ఉద్యోగుల హెల్త్ ట్రస్ట్ సీఈవో తో ఎన్ జిజిఓ/ జేఏసీ నేతల భేటీ





**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఉద్యోగుల హెల్త్ కార్డు వ్యవస్థ ప్రక్షాళనకై ముఖ్యమంత్రి ఉద్యోగ సంఘాల సమావేశంలో ఇచ్చిన హామీ దరిమిల హెల్త్ కార్డులపై అఫీషియల్ కమిటీ ఏర్పాటు చేయడం హర్షదాయకమని ఏపీ జెఏసి చైర్మన్, ఏపీ ఎన్ జిజిఓ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఏ విద్యాసాగర్ ప్రధాన కార్యదర్శి డివి రమణ తెలియచేశారు. 24 లక్షల మంది ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు హెల్త్ కార్డు సేవలు అందటం లేదన్న విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్లామని ధనులు భాగంగానే ఈ అఫీషియల్ కమిటీ ఏర్పాటు అయిందని తెలిపేరు. ఈ కమిటీ 60 రోజుల్లోపు ఈ సమస్యలన్నిటిని పరిష్కరిస్తుందని ఆశ భవాని వ్యక్తం చేశారు. ముఖ్యంగా బిల్లుల స్క్రూటి ని విషయంలో విపరీతమైన జాప్యం జరుగుతుందని, ట్రస్టులో డాక్టర్ల నియామకం చేయవలసిన అవసరం ఉన్నదని, గత నెలలో కొంతమంది డాక్టర్లు అపాయింట్ చేశారని తెలిపారు. అలాగే జిల్లాలో మెడికల్ రీయంబర్స్మెంట్ బిల్లుల స్క్రూటీ నీకు ఉన్న పరిమితిని 50 వేల నుంచి లక్ష రూపాయలకు పెంచాలని కోరారు. ఉద్యోగుల వైద్య సేవల పరిమితిని 2 లక్షల నుంచి 5 లక్షల పైబడి పెంచాలని ఉద్యోగులు కోరుకుంటున్నారని తెలిపారు. ఉద్యోగు హెల్త్ స్కీము మొత్తాన్ని ఇన్సూరెన్స్ లోకి తీసుకురావడానికి కమిటీ దృష్టి సారించాలని కోరారు. రిటైరైన సిపిఎస్ ఉద్యోగులకు హెల్త్ కార్డులు అందజేయాలని, గత దశాబ్ద కాలంలో అమలులో ఉన్న ప్యాకేజీ రేట్లు సవరించాలని తెలిపారు. రిఫరల్ హాస్పిటల్స్ కు చెల్లింపులు సక్రమంగా జరగడంలేదని, ఉద్యోగుల నుంచి వస్తున్న కంట్రిబ్యూషన్, ప్రభుత్వ భాగస్వామ్యాన్ని కూడా ఫైనాన్స్ శాఖ ఉత్తర్వులు ఇచ్చిన విధంగా ప్రతినెల చెల్లింపులు జరపాలని, ప్రతి నెల ఉద్యోగుల జీతాల నుంచి మినహాయిస్తున్న సొమ్మును డైరెక్ట్ గా హెల్త్ ట్రస్ట్ కి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగులు ఉపాధ్యాయులు ముఖ్యంగా రిటైర్ అయిన ఉద్యోగులు పెన్షనర్లు హెల్త్ కార్డుల సేవలు సక్రమంగా అందక తీవ్రమైన ఇబ్బందులు గురి అవుతున్నారని, ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన విధంగా కమిటీ ఏర్పాటు చేయడమే కాక, చీఫ్ సెక్రటరీ పర్యవేక్షణలో సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని భావిస్తున్నామన్నారు. వీటన్నిటిపై ఉద్యోగుల అభిప్రాయాలను సంఘ అభిప్రాయాలను కూడా దబ దఫాలుగా రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేశామన్నారు. ఈ సందర్భంగా హెల్త్ ట్రస్ట్ సీఈవో దినేష్ కుమార్ ఐఏఎస్ని కలిసి అన్ని సమస్యల మీద దృష్టి నిలిపి చర్యలు తీసుకోవాలని కమిటీ ఆధ్వర్యంలో సమస్యలన్నీ పరిష్కారం చేయాలని ఎన్ జిజిఓ /జేఏసీ నేతలు కోరారు. మంగళగిరిలో ఉద్యోగుల హెల్త్ ట్రస్ట్ సీఈవో దినేష్ కుమార్, ఐఏఎస్ ను ఉద్యోగుల హెల్త్ కార్డులు ఉన్న సమస్యలు, కమిటీ ఏర్పాటు తదితర అంశాలపై సమావేశమైన ఏపీ జెఏసి చైర్మన్, ఏపీ ఎన్జీవో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఏ విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డి వి రమణ, జేఏసీ కో చైర్మన్ ఏపీటీఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయ రాజు, ఎన్జీజీవో సంఘ రాష్ట్ర నాయకులు జగదీశ్వరరావు, భారతి ప్రసాద్, శివప్రసాద్, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జానీ భాష, మహిళా నాయకురాలు రాజ్యలక్ష్మి ఉన్నారు.



## నాట్య కళా పీఠంలో ప్రవేశాలు

**మొవ్వ మేజర్ న్యూస్ :** పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర యోగి నాట్య కళా పీఠంలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన కూచిపూడి నాట్యంలో ప్రవేశాలు ప్రారంభమైనాయి. ఈ నెల 20వతారీకుతోముగిసిన అప్లికేషన్ల పర్వంతో133 మంది ప్రవేశాలకు దరఖాస్తులు దాఖలు చేసుకున్నారని వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతా రవి బాలక్రిష్ణ తెలిపారు. అందులో సర్టిఫికెట్ కోర్సు 47, డిప్లమో 30, యక్షగానం 18, సాత్విక అభినయం 10, ఎం పి ఏ 28 మంది చేరడానికి దరఖాస్తులు దాఖలు చేసుకున్నారని తెలిపారు. వీరిలో సాత్విక అభినయం, యక్షగానం, ఎంపిఏకోర్సుల విద్యార్థిని విద్యార్థుల దరఖాస్తులు పరిశీలన, ఇంటర్వ్యూలను నిర్వహించి నట్లు రవి బాలకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏలేశ్వరపుశ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ నల్లగుళ్ళ వెంకటేశ్వరరావు, టీచింగ్ అసిస్టెంట్స్ డాక్టర్ వేదాంతం వెంకట దుర్గా భవాని (మ్యూజిక్),పసుమర్తి హరినాధ శాస్త్రి (మృదంగం), గ్రంథాలయ పాలకులు ఏలేశ్వరపు ఫణి కుమార్ పాల్గొన్నారు.

## బాల్యవివాహాలపై అవగాహన, ప్రతిజ్ఞ



**పామర్రు మేజర్ న్యూస్ :** బాల్య వివాహాల వల్ల కలిగే అనర్ధాలను పామర్రు పోలీసులు పాఠశాల విద్యార్థులకు వివరించారు. పామర్రులోని శ్రీ కంచర్ల రామారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం స్థానిక ఎస్సై వి.రాజేంద్రప్రసాద్ సిబ్బందితో కలిసి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థినీ విద్యార్థులతో ప్రతిజ్ఞను చేయించారు.

## వైభవంగా లోపాముద్ర గోశాల శంకుస్థాపన



**పెడన, మేజర్ న్యూస్:** ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న గోశాల నిర్మాణం శంకుస్థాపన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ మేరకు శ్రీ గంగా పార్వతీ సమేత స్వామి దేవస్థాన సమీపంలో సింగరాజు శ్రీనివాసరావు ధరిత్రి దంపతులచే స్వస్తిశ్రీ చాంద్రమానేనా శ్రీ విశ్వ వసు నామ సంవత్సర మార్గశిర మాసము శుక్లపక్షము పంచమి తిథి యుత గోశాలకు ఉదయం ఐదు గంటల ఆరు నిమిషాలకు ధనిష్ట నక్షత్ర యుక్త తుల లగ్న పుష్కరాంశంలో లోపాముద్ర గోశాల నిర్మాణమునకు శంకుస్థాపన జరిగింది అని హిందూ బంధువుల ఐక్య వేదిక సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారని, వేదమంత్రాలతో ప్రతేక పూజది కార్యక్రమాలు నిర్వహించి శంకుస్థాపన కార్యక్రమాన్ని చేసామన్నారు. ఈ కార్యక్రమాలలో భారీగా భక్తులు పాల్గొని జయప్రదం చేశారని తెలిపారు. అనంతరం గో పూజా కార్యక్రమాలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో హిందూ బంధువుల ఐక్యవేదిక ప్రతినిధులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను
నేటి దినపత్రిక సూర్య నందు నందిగామ టౌన్, నందిగామ రూరల్, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.
ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999